# ఆడపిల్ల తల్లి

**-ఎ.శోభారాణి**

"ఆడపిల్లల తల్లీ బాగున్నావా?"

"బాగానే వున్నాను"

"ఏం బాగులే. వీళ్లందరినీ చదివించి పెళ్లిళ్లు చేసి అప్పుడు చెప్పు."

"ఎందుకు చెప్పనూ? ఎప్పటికీ బాగానే వుంటాను."

"ఇది మనకు ఎప్పుడూ ఉండేదేగానీ వనజమ్మకు పెళ్లి సంబంధం తెచ్చాను. నువ్వు సరేనంటే ఒక బరువు తగ్గినా తగ్గినట్టే కదా"

"పిల్లలు బరువనుకునే స్థితిలో నేను లేను. అయినా దాని వయస్సు ఎంత? పదిహేడు"

"ఏదో నా మాట ఖాతరు చేస్తావని చెబుతాను. ఎప్పుడు విన్నావు కనుక?'

"వినను అని తెలిసి కూడా సలహా ఇస్తావు. ఇదిగో నీ చిన్న కోడలు కాఫీ తెచ్చింది. తాగి ఇంకా ఏమైనా మిగిలిపోయిన సలహాలు చెప్పు."

"మామా! అమ్మ నీ మాట వినదుగానీ నేను నిన్నే చేసుకుంటాను. నేను పెద్దదాన్ని అయ్యేలోపల నువ్వు ముసలాడివి కావద్దు"

మా చిన్నదాని మాటలకు పగలబడి నవ్వి "ఏమే గిరిజ ఈ పోలీసువాడితోనే సరసాలా?"

"సరసాలు, విరసాలు నీతో కాకపోతే మాకు ఎవరు ఉన్నారు చెప్పు మామా?"

"సరేలే మీ అత్త ఏవో పిండివంటలు పంపింది. లోపల పెట్టు"

నేను కమలాకర్ ఇరుగుపొరుగువాళ్లం. కమలాకర్ నాకన్నా పెద్దవాడు. నన్ను పేరు పెట్టి పిలుస్తాడు. నేనూ అంతే. పోలీసు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇంటి అద్దె కోసం ఐదు ఆరునెలలకొకసారి వస్తాడు. వచ్చినప్పుడల్లా మా ఇంట్లోనే భోజనం చేస్తాడు. కమలాకర్ అలా మాట్లాడిన ప్రతిసారీ నాలో ధైర్యం పెరుగుతుంది. పిల్లలను బాగా చదివించాలని పట్టుదలగా నిర్ణయించుకుంటాను.

నా పేరు గౌరి. నా భర్త రైలు ప్రమాదంలో చనిపోయాడు. నా నలుగురు పిల్లలతోనూ, అత్తగారితోనూ పుట్టింటిలోనే ఉంటున్నాను. రెండు ఎకరాల పొలం, రెండు కుట్టుమిషన్లు మా ఆస్తి. పొలం కౌలు ఇంటి ఖర్చులకు, మిషన్లమీద వచ్చే ఆదాయం పిల్లల చదువులకు సరిపోతుంది. నాన్న నా పసుపుకుంకం క్రింద ఇచ్చిన చిన్న ఇల్లు. నేను ఏడో తరగతి చదువుకున్నాను. నాన్న ఆరోగ్యం బాగాలేదని పదమూడవ సంవత్సరంలోనే పెళ్లి చేసారు. ఇరవై సంవత్సరాలకే నలుగురు ఆడపిల్లలు. నేను బాగా చదువుకుని ఉంటే ఆ జీవితం వేరుకదా. నాలా నా పిల్లలు చదువులేని వారు కాకూడదు. బాగా చదివించి ఉద్యోగస్తులను చేయాలి. మాకు పెద్దవాళ్ల అండలేదు. పుట్టింటి ఆదరణలేదు. అత్తగారి సహాయం, సలహాలతోనే, కమలాకర్ మాటలతోనే మా బతుకు బండి లాగుతున్నాను.

పెద్ద అమ్మాయి వనజ తను చదువుతూ చెల్లెళ్లకు, ఇరుగుపొరుగు పిల్లలకు చదువుచెప్పేది. వాళ్ల పాఠాలు వింటూ ఏదైనా మర్చిపోతే అందిస్తూ ఉండేదాన్ని.

ఒకరోజు వనజ "అమ్మా! నువ్వెందుకు చదువుకోకూడదు?" అంది.

"ఇప్పుడు ఎక్కడ చేరి చదువుతాను. అందరూ నవ్వుతారు"

"ఎక్కడికీ వెళ్లే పనిలేదు. నేను నీకు చదువు చెబుతాను. నాకు ఏమన్నా తెలియకపోతే మా టీచర్లను అడిగి చెబుతాను."

మా అత్తగారు కూడా వనజకు వంత పాడుతూ "అది చెప్పిన మాట కూడా ఆలోచించు. ఎంతకాలం మిషను కుట్టి బ్రతుకుతాము. వంట్లో ఓపిక ఉన్నంతవరకేగా? నీకేం వయసు పోయింది. చదువుకుని ఏదైనా ఉద్యోగంచేస్తే నాలుగురాళ్లు వెనకేసుకోవచ్చు. అవే నిన్ను చూస్తాయి. అల్లుళ్లు కొడుకులు కాదుగా" మనవరాలి తెలివికి మురిసిపోతూ.

***

ఆరునెలల్లోనే మెట్రిక్ రాసాను. ఒక సంవత్సరం టీచర్ ట్రెనింగ్ చేసి ఉద్యోగంలో చేరాను. నెమ్మదిగా బిఏబిఇడి చేసాను. పెద్ద అమ్మాయి వనజ ఎంఎ పూర్తిచేసి కాలేజీ లెక్చరర్‌గా చేస్తోంది. రెండోది సుశీల డాక్టర్. మూడో అమ్మాయి విమల బిఎబిఎల్ చదివి లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తోంది. నాలుగోది గిరిజ బ్యాంకులో చేరింది. నలుగురికీ కమలాకర్, అతని భార్య సుందరి మంచి సంబంధాలు వెదికి తెచ్చారు. దగ్గరుండి ఏ లోటూ రాకుండా పెళ్లిళ్లు జరిపించారు. చిన్నదాని పెళ్లి అయిపోయి తీరుబడిగా కూర్చున్నాము.

గిరిజ కమలాకర్ దగ్గరకువచ్చి విచారంగా "మామా! నీ రుణం తీర్చుకోవడానికి కూడా వీలులేకుండా పెళ్లి చేసావు. మరీ అంత స్వార్థం పనికిరాదు"

"పిచ్చిదానా ఋణం లేదు పాడులేదు. మీకో సమే దేవుడు మాకు పిల్లలను ఇవ్వలేదు" అంది కమలాకర్ భార్య సుందరి.

"అయితే మీరిద్దరూ ఇప్పుడు మా పిల్లలు, నేను చెప్పినట్లు వినాలి."

"ఎందుకు వినమూ వింటాము. అందరు ఆడపిల్లలు ఆడపిల్లలని అమ్మను ఎగతాళి చేసేవారు. బంగారు తల్లులు. ఎంత బాగా పెంచింది మీ అమ్మ" మురిపెంగా గిరిజ తల నిమురుతూ అంది సుందరి.

***

ఉగాది పండుగకు నలుగురు అల్లుళ్లు వచ్చారు. కమలాకర్ భార్యతోపాటు వచ్చాడు. మా అత్తగారి సంతోషం అంతా ఇంతా కాదు. ముని మనవళ్లతో ఆటలు ఆడుతూ "గౌరీ! ఇది చూడడానికి వాడికి అదృష్టం లేదమ్మా" అంటూ బాధపడింది. పండుగ మరుసటిరోజు అందరూ చేరి నీతో మాట్లాడాలి అన్నారు. ఏం మాట్లాడారో నని కమలాకర్, సుందరిని అత్తయ్యను కూడా పిలిచి కూర్చోబెట్టుకున్నారు.

"మేము ఒక స్కూలు పెట్టాలని అనుకున్నాము. దానికి నీ సహాయం కావాలి" అంది వనజ.

"నేను ఏం చేస్తాను? నా ఉద్యోగం నాకుం దిగా?"

"ఉంది కాదనను. రెండు సంవత్సరాలు సెలవు పెట్టు. మన స్కూలు బాగా సాగితే ఉద్యోగం మాని వేయవచ్చు. లేదంటే అదే పని చేయవచ్చు."

మా అత్తగారికి వనజ మాటలు బాగా నచ్చుతాయి. అది కాక ఎంతో ఆలోచించిగానీ మాట్లాడదు. మా అత్తగారి ఓటు వనజకే. మిగిలినవాళ్లు కూడా అటే. నా మాట కోసమే ఇదంతా. పిల్లల ఇష్టమే నా ఇష్టం.

★★★

యాభైమంది విద్యార్థులు నలుగురు ఉపాధ్యాయులతో ప్రారంభించిన స్కూలు ఇప్పుడు జూనియర్ కాలేజీ అయింది. డిగ్రీ కాలేజీ కూడా పెట్టాలని ఆలోచన. నా పిల్లలను ఎంత ప్రేమగా, క్రమశిక్షణతో పెంచానో, నా స్కూలును, ఉపాధ్యాయులను అంతే ప్రేమతో క్రమశిక్షణతో పెంచుకుంటూ వచ్చాను.

ఈరోజు నాలాంటివారికి సహాయం చేయగలుగుతున్నాను. ఉద్యోగాలు ఇస్తున్నాను. చదువు చెప్పగలుగుతున్నాను. నన్ను చూసి నలుగురు నేర్చుకునే స్థితిలో ఉన్నాను. ఇదంతా అత్తగారి ప్రేమ, పిల్లల పట్టుదలవల్లే నెరవేరింది.

మునుపు ఎవరైనా ఆడపిల్లల తల్లి అనగానే పైకి బింకంగా ఉన్నా ఎగతాళి చేస్తున్నారా? ఏడిపిస్తున్నారా అని బాధ పడేదాన్ని. ఈ రోజు నాకా మాట ఎంత సంతోషాన్ని కలిగిస్తోంది. ఇంతకీ మా స్కూలు, కాలేజీ కో ఎడ్యుకేషన్ కాదు. ఆడపిల్లలకు మాత్రమే. మా కమలాకర్ ఆడపిల్లల తల్లి అని ఎందుకు పెట్టాడోగానీ ఇన్ని వేలమంది ఆడపిల్లలకు తల్లిని నేను.

గౌరి అనే పేరు పోయి ఆడపిల్లల తల్లిగానే మిగిలింది.

★

